సాక్షి సూర్యాపేట

గురువారం । 14 । నవంబర్ । 2024



అభివృద్ధి పనుల పరిశీలన

గుట్ట ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 586.50 అడుగులు
ఇన్‌ఫ్లో	: 19,168 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 1,9168 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: నిల్
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,248 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.10 అడుగులు
ఇన్‌ఫ్లో	: 652.65 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: నిల్
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

తోట శ్రీజకు రూ.1.20కోట్ల ప్యాకేజీ



తల్లిదండ్రులతో తోట శ్రీజ

మద్దిరాల : మద్దిరాల మండలం గుమ్మడవెల్లికి చెందిన తోట శ్రీజకు అమెరికాలో నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో ఇండియన్ కరెన్సీ ప్రకారం రూ.1.20కోట్ల ప్యాకేజీ దక్కింది. తోట రమేష్, రజిత దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి కుమార్తె శ్రీజ, కుమారు చరణ్ ఉన్నారు. శ్రీజ స్వగ్రామం గుమ్మడవెల్లిలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంది. 2012–13లో 10వ తరగతిలో 9.7జీపీఏ సాధించడంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది. అక్కడ 2013–19 వరకు బీటెక్ చదివింది. ఆ తర్వాత కరోనా కారణంగా ఇంటివద్దే ఉంది. ఎంఎస్ చదవడం కోసం 2022లో అమెరికాకు వెళ్లింది. అక్కడ సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీలో చేరింది. ప్రస్తుతం సెకండ్ ఇయర్ చివరి సెమి స్టర్ చదువుతుండగానే క్యాంపస్ సెలక్షన్స్‌లో అమెరికాకు చెందిన ఏడీపీ(ఆటోమెటిక్ డాటా ప్రాసెసింగ్) కంపెనీ నుంచి ఇండియా కరెన్సీ ప్రకారం రూ.1.20కోట్ల ప్యాకేజీకి ఎంపికైంది. దీంతో శ్రీజ తల్లిదండ్రులతో పాటు బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా శ్రీజ తమ్ముడు చరణ్ బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు.

రైతులు టోకెన్లు తీసుకొని మిల్లులకు వెళ్లాలి

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా నుంచి మిర్యాలగూడలోని మిల్లులకు సన్నధాన్యాన్ని తీసుకెళ్లే రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారుల వద్ద టోకెన్లు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో సన్నధాన్యం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ కారణంగా మిల్లుల వద్దకు భారీగా ధాన్యం లోడ్లు వస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కలెక్టర్ ఆదేశానుసారం టోకెన్లు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు కూడా సన్నధాన్యం వరి కోతలు ఒక్కసారిగా కాకుండా దశల వారీగా చేస్తే మంచి మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సన్న రకాలకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తుందని జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ఈ ధాన్యాన్ని తీసుకువచ్చి లబ్ధి పొందాలని కోరారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



నాగారం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

నాగారం : ప్రజలు అందించే ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ సూచించారు. బుధవారం నాగారం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. సిబ్బంది యూనిఫాం, పరేడ్, పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ నిర్వహణ, రికార్డులు, హిస్టరీషీట్స్, నేరాల నమోదు, కేసుల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసులు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. మారుతున్న సాంకేతికను నేరాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది ఉపయోగించుకోవాలన్నారు. గంజాయి రవాణా, వినియోగం నిరోధించేలా బాధ్యతగా పని చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా, సైబర్ మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య, డీసీఆర్‌బీ ఎస్ఐ యాకూబ్, సీసీ సందీప్, డీసీఆర్‌బీ ఏఎస్ఐ అంజన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

15న పైలెట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

అర్వపల్లి: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ 108, 102 అంబులెన్స్‌ల పైలెట్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి సూర్యాపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 15న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దీన్, జిల్లా ఈఎంఈ శివరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకు వయస్సు ఉండి బ్యాడ్జి కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8919302855, 9963450837 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

- వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని కొత్తబస్టాండ్, ఎంజీరోడ్డు తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు వచ్చిన ధాన్యంలో రైతుల నుంచి ఖరీదు చేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. ఈ బస్తాలను ఖరీదుదారులు ఎగుమతి చేసేందుకు వీలు లేకపోవడంతో వారి కోరిక మేరకు మార్కెట్ అధికారులు గురువారం మార్కెట్ కు సెలవు ప్రకటించారు. రైతులు ఎవరు కొత్తగా మార్కెట్ కు గురువారం ధాన్యం తీసుకురావద్దని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంతోష్ కుమార్ తెలిపారు.



వర్షం కారణంగా సూర్యాపేట పట్టణంలో రోడ్డుపై పారుతున్న వరదనీరు



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

అసంపూర్తిగా.. మనబడి

'మన ఊరు మనబడి' కింద 329 పాఠశాలలు ఎంపిక

- కేవలం 50 స్కూళ్లలోనే పనులు పూర్తి
- మిగిలిన చోట్ల బిల్లులు అందక రెండేళ్లుగా నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : మన ఊరు మన బడి పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఎస్ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే నిలిపివేశారు. మన ఊరు మనబడి కింద జిల్లా వ్యాప్తంగా 329 పాఠశాలలను ఎంపిక చేయగా కేవలం 50స్కూళ్లలోనే పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు..

మన ఊరు మనబడి, మనబస్తీ మన బడి పథకం కింది 2022లో మొదటి దశలోనే 329 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 215, యూపీఎస్‌లు 23, హై స్కూల్స్‌లు 91 ఉన్నాయి. మన ఊరు – మనబడి కింద 279, మన బస్తీ –మనబడి కింద 50 పాఠశాలలు ఎంపిక చేశారు. వీటిలో ప్రధానంగా మరుగుదొడ్లు, నూతన తరగతి గదులు, కరెంటు, డైనింగ్ హాల్స్, కిచెన్ షెడ్, డ్యూయెల్ డెస్క్ టేబుళ్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, మంచినీటి వసతి, ఉపాధ్యాయుల ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.117.31కోట్లు కేటాయించింది. ఇందులో ఎంఎంబీ బడ్జెట్ రూ.75.41కోట్లు, ఎస్ఆర్ఈజీఎస్ బడ్జెట్ రూ.8.42 కోట్లు, సీపీఎం(సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్) బడ్జెట్ రూ.33.47 కోట్లు కేటాయించింది. రూ.30లక్షల పైచిలుకు నిధులు మంజూరైతే టెండర్ ద్వారా చేయాలని, ఆ లోపు అయితే నేరుగా పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్లు పనులు చేయవచ్చనే నిబంధన పెట్టింది. దీంతో కొన్ని పనులు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు చేయగా మరికొన్ని ఎస్ఎంసీ చైర్మన్లు చేశారు.



తుంగతుర్తి బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లర్ల దశలోనే నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులు

ఏడాది దాటినా బిల్లులు రావడం లేదు



నేను తుంగతుర్తి బాలికల ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా పని చేశా. గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి మన ఊరు– మనబడి పథకం కింద స్కూళ్లను ఎంపిక చేసింది. అందులో మా పాఠశాల కూడా ఉంది. నేను అప్పుతెచ్చి పనులు చేయించా. మొత్తం రూ.16లక్షల వరకు పనులు చేయగా ఇంకా రూ.4.35లక్షల వరకు బిల్లులు రాలేదు. ఏడాది దాటినా బిల్లులురాకపోవడంతో వడ్డీలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే బిల్లులు వచ్చేలా చూడాలి.

– పోతరాజు వెంకన్న, ఎస్ఎంసీ మాజీ చైర్మన్, తుంగతుర్తి బాలికల ఉన్నత పాఠశాల

279 స్కూళ్లలో నిలిచిన పనులు

జిల్లాలో మొత్తం 329 పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకం కింద పనులు ప్రారంభం అయ్యాయి. వీటిలో 50 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 279 పాఠశాలల్లో వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. మనబడి పథకం కింద ఎంపికైన స్కూళ్ల కోసం ప్రభుత్వం మొత్తం రూ.117.31కోట్ల బడ్జెట్ కేటాయించగా అందులో రూ.64.86కోట్ల పనులు ఎస్ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు చేశారు. అందులో రూ. 32.03కోట్ల నిధులు ఆయా పనులకు విడుదల కాగా ఇంకా రూ.32.05కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో పనులు చేసిన ఎస్ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. పాఠశాలల్లో అయితే 2023లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో మళ్లీ కొత్త పనులను ప్రారంభించింది. దీంతో ఈ పనులు అలాగే నిలిచిపోయాయి.

గ్రూప్–3 పరీక్షలకు 50 కేంద్రాలు

- 17న పేపర్–1, పేపర్–2, 18న పేపర్–3
- హాజరుకానున్న 16,543 మంది అభ్యర్థులు
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వెల్లడి

భానుపురి (సూర్యాపేట) : టీజీపీఎస్సీ గ్రూప్ –3 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వెల్లడించారు. టీజీపీఎస్సీ గ్రూప్–3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, డీఓ, ఫ్లయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్‌తో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1(జనరల్ స్టడీస్, జనరల్ఎబిలిటీస్) పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షకు సెంటర్ గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ –2 హిస్టరీ, పాలిటికల్ అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్ష కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారన్నారు. ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ –3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 16,543 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్ , ఎరేజర్, హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడీకార్డులను మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలన్నారు. సెల్‌ఫోన్, చేతి గడియారాలు,ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

21,175 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో రైతుల నుంచి 21,175 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ధాన్యం, పత్తి కొనుగోలు, సామాజిక ఆర్థిక సర్వే, గ్రూప్ – 3 పరీక్షల నిర్వహణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. 699 మంది రైతులకు రూ.16 32కోట్లు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. 1,15,582 గృహాలకు సంబంధించి సమగ్ర సర్వే పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో ఎస్పీ, అధికారులు

తుంగతుర్తి గురుకుల పాఠశాలలో విచారణ

- విద్యార్థుల పట్ల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తీరుపై ఫిర్యాదులు
- పాఠశాలలో వివరాలు ఆరా తీసిన డీఈఓ, సొసైటీ అధికారులు



తుంగతుర్తిలోని గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

తుంగతుర్తి: తుంగతుర్తిలోని బాలుర గురుకుల పాఠశాలలో పురుగులతో కూడిన భోజనం అందించడంతో పాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులతో పాటు పత్రికల్లో వార్తలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం డీఈఓ అశోక్, గురుకుల సొసైటీ అధికారులు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న సంఘటనలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎందుకు అందించడం లేదని అడిగారు. అకారణంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యార్థులను ఎందుకు కొట్టాడని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పురుగులు ఎందుకు వస్తున్నాయని వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సొసైటీ ఏజెన్సీ వారే సరుకులు సరఫరా చేస్తున్నారని అవి పురుగులు పట్టి నాసిరకంగా ఉంటున్నాయని వారు డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంతోనే ఈ సంఘటనలు జరుగుతున్నాయని వారు తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో జరిగిన సంఘటనలపై సంబంధిత వార్డెన్ తో పాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సంజాయిషీ కోరామని తెలిపారు. తహసీల్దార్ దయానందం, ఎంఈఓ లింగయ్య, రామన్నపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

15న బేస్‌బాల్ సెలక్షన్స్

హుజూర్‌నగర్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 15న హుజూర్ నగర్‌లోని క్యాంప్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ ఆజంబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17 ఏళ్ల లోపు బాల బాలికలకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ పాఠశాల హెచ్‌ఎం ధ్రువీకరించిన బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో రావాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా బేస్‌బాల్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16న నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలి



హుజూర్‌నగర్ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

హుజూర్‌నగర్ : రైతులు ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు సూచించారు. బుధవారం హుజూర్ నగర్ వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడ రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మొదటి రకం ధాన్యానికి రూ 2,820లతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సాంబమసూరి ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధరతో పాటు, బోనస్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కనీసం రూ. 2400లకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని ఆయన వారికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్ఓ రాజేశ్వర్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఏడీఏ రవి, ఏఓ స్వర్ణ, డీటీసీఎస్ రాంరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లరి పిల్లవాడిని

'నేటి పిల్లలు బట్టీ చదువులకు పరిమితం అవుతున్నారు. అది సరైన విధానం కాదు.. కాన్సెప్ట్ అర్థం చేసుకొని చదివితే అది ఎప్పటికీ గుర్తుండిపోతుంది.. ప్రశ్నలు ఏ పద్ధతిలో అడిగినా జవాబులు రాయగలుగుతారు. అంతేకాదు గేమ్స్, స్పోర్ట్స్ వంటి సహ పాఠ్య కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. అప్పడే వారిపై వారికి నమ్మకం (కాన్ఫిడెన్స్), పోటీతత్వం, సమస్యలను ఎదుర్కొనే పట్టుదల పెంపొందుతాయి' అని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. గురువారం(14వ తేదీన) జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా శరత్‌చంద్ర పవార్ తన బాల్య స్మృతులను 'సాక్షి'తో పంచుకున్నారు. -సాక్షి ప్రతినిధి, నల్లగొండ



- చిన్నప్పుడు ఆటలతోపాటు చదువులోనూ ముందే
- టెన్త్ వరకు క్లాస్ టాప్–3లో ఉన్నా..
- స్కూల్ కెప్టెన్, క్రికెట్ టీం కెప్టెన్‌నూ నేనే..
- నేటి పిల్లలు బట్టీ చదువులకు పరిమితం కావొద్దు
- చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి
- స్పోర్ట్స్‌తో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెరుగుతాయి
- పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి

చిల్డ్రన్స్ డే సందర్భంగా.. 'సాక్షి'తో బాల్య స్మృతులు పంచుకున్న నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్



ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 8వ తరగతి చదువుతున్నప్పుడు స్కూల్లో తీసిన ఫొటో

నేను పుట్టి.. పెరిగింది సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో. మహేంద్రహిల్స్‌లో ఆగ్జిలియం హైస్కూల్లో పదో తరగతి వరకు చదువుకున్నా. నాన్న బాలాజీ పవార్ డాక్టర్. ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలు తిరిగే వారు. ఇంట్లో అమ్మ సుశీల, చెల్లెలు, నేను ఉండేవారం. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేసిన కారణంగా నాన్న వారానికి ఒక రోజు ఇంటికి వచ్చేవారు. దీంతో అమ్మే మాకు అన్నీ. తానే కూర్చో బెట్టి చదివించేది. హోంవర్క్ చేయించేది. చిన్నప్పుడు నేను చాలా అల్లరి చేసే వాడిని. ఆటల్లో ముందుండే వాడిని. సెలవు వచ్చిందంటే ఇంట్లో ఉండేవాడిని కాదు. ఇంటి ఎదురుగా ఉండే గ్రౌండ్‌లోనే ఫ్రెండ్స్‌తో ఉండేవాడిని. ఇప్పుడు మా అబ్బాయి సంప్రీత్‌కు మూడేళ్లు. చాలా అల్లరి చేస్తాడు. నేను సాయంత్రం ఇంటికి వెళ్లి వాడితో కాసేపు ఆడుకుంటే చాలా రిలీఫ్‌గా ఉంటుంది.

తెలుగు, హిందీ తప్ప మిగతా అన్నింటిలో టాప్

స్కూల్లో అన్ని తరగతుల్లో ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్‌లో టాప్ స్టూడెంట్‌నే. బాగా చదివే వాడిని. మాతృభాష తెలుగు, ద్వితీయ భాష హిందీలో కొంత వెనుకబడి ఉండేవాడిని. సబ్జెక్టుల్లో 90 శాతం మార్కులు సాధిస్తే.. భాషల్లో 60 శాతం వచ్చేవి.

స్కూల్ కెప్టెన్‌గా..

చదువుతోపాటు సహ పాఠ్య కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే వాడిని. దాంతో స్కూల్ కెప్టెన్‌ను అయ్యాను. ఆటల్లో టాప్ ఉండేవాడిని. అన్ని రకాల ఆటలు ఆడేవాడిని. ఎక్కువగా క్రికెట్. స్కూల్ క్రికెట్ టీంకు నేనే కెప్టెన్. పాఠశాల యాజమాన్యం కూడా క్రికెట్‌ను ఎక్కువగా ప్రోత్సహించేది. ఆటలపై శ్రద్ధ ఎక్కువ పెట్టినా చదువును నిర్లక్ష్యం చేయలేదు. బాగా చదువుకునే వాడిని. పదో తరగతి వరకు టాప్–3 విద్యార్థుల్లో నేను ఉండేవాడిని.

తల్లిదండ్రులే మొదటి గురువులు..

విద్యార్థులకు తల్లిదండ్రులే మొదటి గురువులు. వారు ఎప్పుడూ పిల్లలపై దృష్టి పెట్టాలి. పిల్లలేం చేస్తున్నారో గమనిస్తూ ఉండాలి. నేడు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్న పిల్లల్లో స్కూల్స్ విద్యార్థులు ఉంటున్నారు. అది చాలా ప్రమాదకరం. పిల్లలు కుటుంబ సమ్మేళనాలకు హాజరు కాపోవడం, ఇంట్లో ఉండకపోవడం, సరిగ్గా తినకపోవడం, నిద్రపోకపోవడం వంటి లక్షణాలను గమనిస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. వారేం చేస్తున్నారో తెలుసుకొని గాడిలో పెట్టాలి. డ్రగ్స్‌కు వారిని దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. మన పిల్లలు అలా చేయరని వారితో వాటి గురించి మాట్లాడకుండా ఉండటం మంచిది కాదు. మా పిల్లలకు అలాంటి అలవాట్లు లేవని, మా పిల్లలు మంచి వాళ్లని భావిస్తూ వారితో చర్చించకుండా ఉండొద్దు. డ్రగ్స్ వాటి పర్యవసానాలను వారికి వివరించి వాటి జోలికి పోకుండా వారి బంగారు భవిష్యత్తుకు దోహద పడేలా తల్లిదండ్రులు కృషి చేయాలి.

అన్నీ చదువుతో రావు..

చదువు ఒక్కటే జీవితం కాదు..అలాగని చదువును నిర్లక్ష్యం చేయవద్దు. బట్టీ పట్టి చదవడం మానేసి కాన్సెప్ట్ అర్థం చేసుకోవాలి. అప్పుడే చదువులో రాణిస్తారు. ఓవరాల్ డెవలప్‌మెంట్ ముఖ్యం. పదో తరగతికి వచ్చే సరికి చదువుతోపాటు ఏదో ఒక గేమ్‌లో టాప్‌లో ఉండాలి. దాని ద్వారా వారిలో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. ఏదైనా సాధించాలనే పట్టుదల వస్తుంది. యూపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ఇంటర్వ్యూల్లో అదే చూస్తారు. ఆలోచన విధానం ఎలా ఉంది.. మానసిక స్థితి ఏంటి? సమస్య పరిష్కారం ఎలా చేస్తాం.. అన్నది చూస్తారు. అవి చదువుతో రావు. స్పోర్ట్స్‌తోనే అవి మనలో డెవలప్ అవుతాయి. వ్యక్తిగతంగా మన జీవితంలోనూ అవే ఉపయోగపడతాయి. ఈ విషయాన్ని ఇప్పటి విద్యార్థులు అర్థం చేసుకోవాలి.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ

బీబీనగర్: మండలంలోని జైనపల్లి గ్రామంలో ఉన్న పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని అమ్మవారి పంచలోహ విగ్రహం, త్రిశూలం 10 తులాల వెండి, అమ్మవారి బంగారు తాళిబొట్టు అపహరించకుపోయినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిప్పర్తి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తిప్పర్తి మండలంలోని మల్లేవల్లివారిగూడెం వద్ద బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జూకూరి కొండయ్య (65) ఉదయం తన వ్యవసాయ పొలానికి కాలినడకన వెళ్తుండగా హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కొండయ్య తలకు, కాళ్లకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు జూకూరి గురువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని హుస్సేనాబాద్ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ సీఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనాబాద్‌లోని ధర్మవన నేచర్ ఆర్చ్‌లో కార్మికులు గడ్డి తీస్తుండగా.. ప్రధాన గేటు వద్ద వ్యక్తి మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని మేనేజర్ వేణుగోపాల్ రావుకు చెప్పగా ఆయన పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 20 నుంచి 30 మధ్యన వయసు ఉంటుందని, రెండు నెలల క్రితం మరణించి ఉంటాడని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


గణిత (ఫైల్)

మద్దిరాల: మనస్తాపానికి గురైన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మద్దిరాల మండల పరిధిలోని చిన్ననెమిల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిదిలోని చిన్ననెమిల గ్రామానికి చెందిన దబ్బెటి మహేష్, గణిత (33) భార్యభర్తలు. వీరి మధ్య మంగళవారం రాత్రి చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన గణిత బుధవారం తెల్లవారుజామున ఇంటి పక్కనే గల వ్యవసాయ భూమి వద్ద క్రిమి సంహారక మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తండ్రి జగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. గణిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దాడి కేసులో నలుగురికి రిమాండ్

చందంపేట: మండలంలోని గువ్వలగుట్టతండా గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బందిపై గువ్వలగుట్ట గ్రామానికి చెందిన రమావత్ హన్మా, రమావత్ రంగ, రమావత్ లోక్‌నాథ్ రమావత్ లక్పతిలు దాడి చేసి గాయపర్చారు. ఈమేరకు బుధవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

- బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు స్వాధీనం

పెద్దఅడిశర్లపల్లి: పెద్దఅడిశర్లపల్లి మండలంలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను గుడిపల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు వివరాలు వెల్లడించారు. మండలంలోని అంగడిపేటకు చెందిన తంగిల గంగాధరాచారి, మోటమర్రి ఆంజనేయులు జల్సాలకు అలవాటు పడి కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతేడాది మండల కేంద్రంలోని వంగాల లక్ష్మారెడ్డి ఇంట్లో బంగారం, రూ.ఐదు లక్షల నగదు చోరీకి గురైంది. లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. నమ్మదగిన సమాచారంతో బుధవారం ఉదయం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా కారులో వెళ్తున్న అంగడిపేటకు చెందిన తంగిల గంగాధరాచారి, మోటమర్రి ఆంజనేయులును నిందితులుగా గుర్తించి విచారణ చేశారు. మండల కేంద్రంలో జరిగిన దొంగతనంతో పాటు గత వారంలో అంగడిపేటలో జరిగిన చోరీ, కొండమల్లేపల్లిలో ఎలక్ట్రికల్ షాపులో జరిగిన చోరీ తామే చేసినట్లు వారు అంగీకరించారు. వారి నుంచి చంద్రహారం, రూ.45 వేలు, కూలర్ మోటార్లు, వడ్రంగి సామన్లు, కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన సొమ్ము సుమారు రూ.6 లక్షల విలువ ఉంటుందని డీఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకున్న కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, కానిస్టేబుళ్లు శ్రీధర్‌రెడ్డి, హేమునాయక్, భాస్కర్, గురువారెడ్డి, లింగయ్య, రవిలను డీఎస్పీ అభినందించారు.

నూజివీడు టు హైదరాబాద్

- అక్రమంగా 300 గోవుల తరలింపు
- ఐదు డీసీఎంలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు


డీసీఎంలో ఉన్న గోవులు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా గోవులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూజివీడు నుంచి ఐదు డీసీఎం వ్యాన్‌లలో గోవులను తీసుకుని వస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీకి సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి మిర్యాలగూడలో ఆ డీసీఎంలను అడ్డగించారు. మిర్యాలగూడ రూరల్ పరిధిలో ఒక డీసీఎంను పట్టుకోగా వన్‌టౌన్ పరిధిలో రెండు డీసీఎంలను పట్టుకున్నారు. అతివేగంగా వెళ్లిన మరో రెండు డీసీఎంలను మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. వాటిని పరిశీలించగా ఐదు డీసీఎంలలో మొత్తం 300 గోవులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఐదుగురు డీసీఎం డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. తమకేమి తెలియదని, వ్యాపారులు గోవులను డీసీఎంలలో ఎక్కించి తమకు సెల్ నంబర్లు ఇచ్చారని.. హైదరాబాద్‌కు తరలించిన తరువాత ఫోన్ చేస్తే వాటిని స్వాధీనం చేసుకుంటామని చెప్పడంతో తీసుకపోతున్నామని డ్రైవర్లు చెప్పారు. దీంతో వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గోవులను వివిధ గోశాలలకు తరలించారు. అందులో ఆరు గోవులు మృత్యువాత పడినట్లు సమాచారం.

నకిరేకల్ వద్ద 68 గోవుల పట్టివేత


నకిరేకల్: గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని హయత్ నగర్‌కు చెందిన వ్యక్తి తన డీసీఎం వాహ్యన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు ప్రాంతం నుంచి 68 గోవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా నకిరేకల్ వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. డీసీఎం వ్యాన్‌లో 68 గోవులు ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్‌చేశారు. అందులో ఉన్న గోవులను చండురులోని గోశాలకు తరలించారు. డీసీఎం యజమాని విజయ్, డ్రైవర్ బాషపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

గోవులు తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

చౌటుప్పల్: గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను బుధవారం చౌటుప్పల్‌లో పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఎండీ ఖాజా, హరిహర హరిజన్‌లు విజయవాడలో 70 గోవులను కొనుగోలు చేశారు. వాటిని కంటైనర్‌లో హైదరాబాద్‌లోని బహదూర్‌పురలో ఉన్న కబేళాకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు చౌటుప్పల్ బస్‌స్టేషన్ ఎదుట తనిఖీ నిర్వహించి, గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నారు. గోవులను గోశాలకు తరలించి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వీపులపై చితకబాది.. బింగీలు తీయించి..

- అల్లరి చేస్తున్నారని ప్రైమరీ విద్యార్థులను దండించిన ప్రైవేట్ పాఠశాల టీచర్లు


చితక బాదడంతో దద్దులు వచ్చిన విద్యార్థి వీపుభాగం

త్రిపురారం : అల్లరి చేస్తున్నారని ప్రైమరీ విద్యార్థులపై ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు పాశవికంగా వ్యవహరించారు. ఒక్కో విద్యార్థితో 30 నుంచి 40 బింగీలు తీయించి, ఆపై వీపులపై బెత్తంతో చితకబాదారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఈ ఘటనపై ఎంఈఓ రవినాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురారంలో నిర్వహిస్తున్న ఆల్ఫా ఉన్నత పాఠశాలలో మండల కేంద్రానికి చెందిన మోక్షిత్ 1వ తరగతి, హనీష్ యూకేజీ చదువుతున్నారు. రెండు రోజుల క్రితం పాఠశాలలో వీరిద్దరితో పాటు యూకేజీనే చదువుతున్న మరో ఆరుగురు విద్యార్థులు గొడవ చేయడంతో టీచర్లు శశికళ, రమణ కోపోద్రిక్తులయ్యారు. చిన్నారులని చూడకుండా ఒక్కొక్కరితో బింగీలు తీయించి, వీపులపై బెత్తంతో కొట్టారు. విద్యార్థులు ఇంటికి వెళ్లి అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి నిలదీశారు. ఈ విషయం ఎంఈఓకు తెలియడంతో బుధవారం పాఠశాలలో విచారణ నిర్వహించగా టీచర్లు పిల్లలను దండించిన విషయం వాస్తవమేనని తేలింది. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చానని, వారి ఆదేశాల మేరకు పాఠశాలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ రవినాయక్ తెలిపారు.

తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


యాదాద్రి బ్రాంచ్ కార్యదర్శి సందీప్‌రెడ్డి

మిర్యాలగూడ: తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదాద్రి బ్రాంచ్ కార్యదర్శిగా నంద్యాల సందీప్‌రెడ్డి, కోశాధికారిగా రాములు, అడిషనల్ సెక్రటరీగా జ్యోత్స్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంక్షేమానికి, వారి హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నికకు జగదీశ్‌చంద్ర పట్నాయక్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రత్నాకర్, పి.సదానందం, జి.బుచ్చయ్య, జెన్‌కో కమిటీ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, బ్రహ్మాజీలు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిలిచి ఉన్న బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు గాయాలు


కేతేపల్లి వద్ద ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

కేతేపల్లి: ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో హైవేపై నిలిచిపోయిన ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున కేతేపల్లిలోని 65 నంబరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏపీలోని నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. కేతేపల్లి వద్దకు చేరుకోగానే ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బస్సులోని ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కించి గమ్యస్థానాలకు పంపించారు. అదే మార్గంలో వస్తున్న ఉయ్యూరు డిపోకు చెందిన మరో ఆర్టీసీ లగ్జరీ బస్సు కేతేపల్లి వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు రెండు కాళ్లు విరిగిపోయాయి. బస్సులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన పి.సూర్యసాయి, తిరుపతమ్మ, ఎం.రజనీలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.

గుట్ట ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన


కొండపైన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్‌నిర్మాణంలో భాగంగా కొండపైన చేపట్టిన అభివృద్ధి పనులను ఆర్‌అండ్‌బీ క్యూసీ సీఈ మోహన్‌నాయక్, పుల్లారావుల బృందం బుధవారం పరిశీలించింది. సీఎం రేవంత్ ఇటీవల ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా వైటీడీఏతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆలయ అభివృద్ధి పనులపై సమీక్షించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకుపూర్తయినవి, పెండింగ్ పనుల వివరాలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యం అధికారుల బృందం ప్రధానాలయం, మాఢ వీధులు, తిరు వీధులు, బస్టాండ్, కమాండ్ కంట్రోల్ భవనం, పార్కింగ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. పూర్తయిన పనులు, చెల్లించిన బిల్లులు, పెండింగ్ బిల్లుల వివరాలు తెలుసుకున్నారు. నివేదికను ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. అభివృద్ధి పనులు పరిశీలించిన వారిలో ఆర్‌అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి, హెచ్ఎండీఏ సీఈ పరంజ్యోతి, ఎస్ఈ వసంత్‌నాయక్, క్యూసీ ఎస్ఈ సుదర్శన్‌రెడ్డి, వైటీడీఏ అధికారులు ఉన్నారు.

జాతీయస్థాయిలో మాంట్‌ఫోర్డ్ విద్యార్థుల ప్రతిభ


మఠంపల్లి మాంట్‌ఫోర్డ్ స్కూల్ విద్యార్థులు

మఠంపల్లి: మఠంపల్లికి చెందిన మాంట్‌ఫోర్డ్ స్కూల్ విద్యార్థులు ఈనెల 9 నుంచి 11వరకు విజయవాడలోని పడమటలో గల ఎన్ఎస్ఎం పాఠశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ వినోద్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో గోవా, మహారాష్ట్ర, పూణె, ముంబాయి, వైజాగ్, తెలంగాణ క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. మఠంపల్లి మాంట్‌ఫోర్డ్ విద్యార్థులు బాలికల విభాగంలో వాలీబాల్ ప్రథమ స్థానం, బాలుర విభాగంలో ఖోఖోలో ద్వితీయ స్థానం సాధించడంతోపాటు అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్ త్రో ప్రథమ స్థానం, షార్ట్‌పుట్ ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

తుంగతుర్తి: బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన తుంగతుర్తి శివారులో బుధవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గాజుల రాములు (59) రామన్నగూడెం నుంచి తుంగతుర్తి మీదుగా అన్నారం గ్రామానికి వెళ్తున్నాడు. అదే సయమంలో గున్నెపల్లి గ్రామానికి చెందిన దేశగాని ప్రశాంత్ తుంగతుర్తి నుంచి మద్దిరాల వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుంగతుర్తి శివారులోని బాలికల గురుకుల పాఠశాల సమీపానికి రాగానే ప్రశాంత్ వేగంగా వచ్చి ముందు వెళ్తున్న రాములు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాములు కింద పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. రాములు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం


అభిలాష్ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయం సమీపంలో బుధవారం తెలవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్ గ్రామానికి చెందిన బర్రె అభిలాష్ కుమార్(24), తన స్నేహితుడు షేక్ రుమాన్‌తో కలిసి బైక్‌పై చౌటుప్పల్ వైపు వస్తున్నాడు. దండు మల్కాపురం గ్రామ పరిధిలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయం సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అభిలాష్ కుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న షేక్ రుమాన్‌కు గాయాలయ్యాయి. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమాదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా యాదవరెడ్డి తెలిపారు.

సినీఫక్కీలో చోరీ

- రూ 14.50 లక్షల అపహరణ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో సినీఫక్కీలో చోరీ జరిగింది. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి రూ.14.50 లక్షలు అపహరించుకుపోయారు. బాధితుడు గెల్లి రంగారావు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి పారాబాయిల్డ్ మోడ్రన్ రైస్‌మిల్ గుమస్తా వెంకటేశ్వర్లు ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి రూ.14.50 లక్షలు డ్రా చేశాడు. వాటిని బ్యాగులో వేసుకుని మోటార్ సైకిల్ ట్యాంక్‌పై పెట్టుకుని వస్తుండగా స్థానిక అడ్డరోడ్డు సమీపంలోకి రాగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి బ్యాగును లాక్కెళ్లారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు.

చోరీ కేసులో 8 నెలల జైలు

చివ్వెంల(సూర్యాపేట): దొంగతనం కేసులో వ్యక్తికి 8 నెలల 22 రోజుల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు బుధవారం తీర్పునిచ్చారు. సూర్యాపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన బూర దశరథ తన కుమార్తెకు పరీక్షల కోసం జనవరి 18న హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి 23న వచ్చాడు. ఇంటికి రాగానే తలుపు తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లో బీరువాలో ఐదున్నర తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు స్థానిక పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ రాజ శేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ కుశలవ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లోని మేడ్చల్‌కు చెందిన రోషన్ కుమార్ సింగ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు తానే అపహరించినట్లు ఒప్పుకోవడంతో 8 నెలల, 22 రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

మద్యం తాగి న్యూసెన్స్ చేసిన ఐదుగురికి జరిమానా

డిండి: దసరా పండుగను పురస్కరించుకొని గ్రామంలో న్యూసెన్స్ చేసిన ఐదుగురికి దేవరకొండ స్పెషల్ ముబిల్ మార్నింగ్ కోర్టు మెజిస్ట్రేట్ పొట్ట చెన్నయ్య బుధవారం రూ.10వేల జరిమానా విధించారు. డిండి మండల పరిధిలోని సంపంగి బాలకృష్ణ, నారిమళ్ల సాయికిరణ్, సంపంగి ఆంజనేయులు, సంపంగి అరవింద్, కిన్నెర రాకేష్‌లు దసరా రోజు గ్రామంలో మద్యం తాగి న్యూసెన్స్ చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. విచారణ అనంతరం దేవరకొండ కోర్టులో ఒక్కొకరికి రూ. 2 వేల చొప్పున జరిమానాతోపాటు, కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా ఒక రోజు కోర్టు ఆవరణ శుభ్రం చేయించాలని తీర్పునిచ్చినట్లు ఎస్ఐ రాజు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ 242 Sq.Yds. Plot For Sale on Highway Road, 2Acr Land Lease/Rent Available for Fuction Hall. Contact: 8885777477. [Y_1145760]

Services

వధువు కావలెను
■ కోమట్ల లేక బి.సి. అమ్మాయి కావలెను. 1, కోమట్ల అబ్బాయి 35 M.Sc, M.Ed ప్రైవేట్ లెక్చరర్ వ్యవసాయం 20 వేలు , ఆస్తి 50 లక్షలు. నల్లగొండ. సెల్ : 9121325068 [Y-798344]

SSC మెమో పోయినది
■ నేను అనగా బుర్ర వంశీకృష్ణ యాదవ్ S/o నాగరాజు యాదవ్ R/o హెప్లతండ. తేది. 20-10-2024 న హెప్లతండ నుండి మేళ్ళచెర్వు MRO ఆఫీసుకు ఆటోలో వెళ్ళుచుండగా SSC ఒరిజినల్ మెమో రూల్ నెం. 1136116176 పోయినది. దొరికిన వారు సంప్ర॥ 9014445089 [Y-798373]

Wanted
■ సెక్యూరిటీ గార్డ్స్ జీతం 13,000/- + OT, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 8 గం॥ డ్యూటీ, ఫ్రీ రూం, తక్కువ రేటుకు భోజనం మేళ్లచెరువు సిమెంట్ ఫ్యాక్టరీలో కావలెను. ✆ 86884 17132, 90143 51804 [B-327]
■ రియల్ ఎస్టేట్ Co.HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. కావలెను. జీ/కమీషన్ + 2వీలర్ + రూం+భో ఫ్రీ, నె॥లక్ష రూ॥. ఫ్రెష్/Exp. ఫోన్: 7416396781 [HA-16464]
■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్, జీ: 18K. ఫోన్: 9912011899, 9912011499 [SCA24000626]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలుచదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మోతె: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మోతె మండల పరిధిలోని గోల్‌తండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు నాగరాజు(25) గత రెండు సంవత్సరాల క్రితం పొలం పనులు చేస్తుండగా కాలు జారి కింద పడడంతో అనారోగ్యం బారిన పడ్డాడు. గత నెల 26న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం ఇంటికి వచ్చాడు. గత రెండు రోజుల క్రితం ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో నాగరాజును డాక్టర్ల సలహా మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి అన్న బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని కొత్తగూడెంతండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 8.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంతండాలో సైదా ఇంటి వద్ద రేషన్ బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేసి 8.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆరా తీయగా బియ్యం గుగులోత్ నాగరాజుకు చెందినవిగా గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిని హత్యచేసిన కొడుకు, కోడలు రిమాండ్

మునుగోడు: కుటుంబ తగాదాల కారణంగా కన్న తండ్రిని గొడ్డలితో హత్యచేసిన కొడుకు, కోడలిని మునుగోడు పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. చండూరు సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన కట్కూరి రామచంద్రాన్ని అతడి పెద్ద కుమారుడు నర్సింహ, కోడలు రేణుక 11వ తేదీన కుటుంబ కలహాల కారణంగా గొడ్డలితో నరికి చంపారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి వారిని విచారించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ ట్రాలీ పల్టీ


ట్రాక్టర్ ట్రాలీని స్థానికులతో కలిసి పక్కకు తొలగిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి: సూర్యాపేట నుంచి నకిరేకల్ వైపునకు గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను బుధవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో గల టోల్‌గేట్ వద్ద లారీ ఢీకొట్టింది. రోడ్డుపై పల్టీ కొట్టిన ట్రాలీని డ్రైవర్ అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. అదే మార్గంలో వస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘటన స్థలం వద్ద తన వాహనాన్ని ఆపి కిందకు దిగారు. రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న ట్రాలీని స్థానికులతో కలిసి పక్కకు తొలగించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చివ్వెంల(సూర్యాపేట): కారు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని కాసింపేట గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన కత్తుల వీరమల్లు (52) వృత్తి రీత్యా తాపీ మేస్త్రీగా చేస్తున్నాడు. బుధవారం దురాజ్‌పల్లి గ్రామంలో పనిచేసి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు ఇతడి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వీరమల్లు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా.. ప్రమాద ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


విద్యారాణికి స్వాగతం పలుకుతున్న క్రీడాకారులు

నడిగూడెం: విద్యార్థినులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ అధికారి ఎస్.విద్యారాణి సూచించారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆమె పరిశీలించారు. అంతకు ముందు ఆమెకు క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికారు. గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులను ప్రోత్సహించేందుకు జోనల్, రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల ద్వారా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పలు క్రీడల్లో గెలుపొందినవారికి మెడల్స్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఓ విద్యాసాగర్, స్థానిక ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పద్మ, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, ఎ.వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవారిని అందంగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు